పత్రికాప్రకటన కాకినాడ, 27.7.2018

ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో వివిధ శాఖల ద్వారా మంజూరు చేసి ఇప్పటికీ ప్రారంభించని అభివృద్ధి పనులన్నిటినీ వెంటనే మొదలుపెట్టి రానున్న 2 నెలల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా అధికారులను ఆదేశించారు.

శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ కోర్టు హాలులో జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుతో కలిసి ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు ప్రగతిని ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో చేపట్టిన రోడ్లు, వంతెనలు, పాఠశాల ప్రహరీ గోడలు, త్రాగునీటి సరఫరా, పంచాయతీ భవనాలు, నీరు-చెట్టు తదితర పనులల్లో ప్రారంభం కాని వాటన్నిటినీ వెంటనే మొదలు పెట్టి రెండునెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం వివిధ దశల నిర్మాణంలో ఉన్న పనులను ఆగష్టు 15 లోపు పూర్తి చేసి ప్రారంభోత్సవాలు నిర్వహించాలని సూచించారు. అలాగే వివిధ సంక్షేమ కార్పొరేషన్ పథకాల క్రింద 2016-17, 2017-18 సంవత్సారాల యూనిట్ల స్థాపన, 2018-19 లక్ష్యంలో 25 శాతం యూనిట్ల స్థాపన ఆగష్టు-15 నాటికి పూర్తి కావాలని యండిఓలు, మున్సిపల్ కమీషనర్లు, సంక్షేమ కార్పొరేషన్ల ఈడిలను ఆదేశించారు. ఇన్చార్జిలతో నడుస్తున్న రేషన్ షాపులన్నిటికీ రెగ్యులర్ డీలర్ల నియామకాలు జరపాలని, ప్రతినెలా 2వ తేదీనాటికే పింఛన్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. నియోజక వర్గం పరిధిలో రుణ అర్హత కార్డులపై 25 కోట్లు, సాగు ద్రువపత్రాలపై 15 కోట్లు, జెఎల్జి గ్రూపుల ద్వారా 10 కోట్లు, రైతుమిత్ర గ్రూపుల ద్వారా మరో 10 కోట్లు కౌలురైతులకు పంపిణీ చేయాలని లక్ష్యం నిర్ధేశించారు. అలాగే పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు పెద్ద సంఖ్యలో చేపట్టేలా ప్రోత్సహించాలని, వ్యవసాయ యాంత్రికరణ పథకం క్రింద ఎంపిక చేసిన రైతులకు ఆగష్టు 15న యంత్రాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. నియోజక వర్గం పరిధిలోని పిహెచ్సిలు, సిహెచ్సిలలో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిసిహెచ్ఎస్ను ఆదేశించారు.

సమావేశంలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ నియోజక వర్గంలో జరుగుతున్న పనులకు ఇసుక కొరత లేకుండా చూడాలని, సాధ్యమైతే నియోజకవర్గం పరిధిలోనే ఇసుక రీచ్లు లేదా బోట్ల ద్వారా ఇన్స్ట్రీమ్లలో మైనింగ్ అనుమతించాలని జిల్లా కలెక్టర్ను కోరారు. నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం క్రింద కాల్వలు, డ్రెయిన్లలో తూడు తొలగింపు, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని కోరారు. 40 గ్రామాల్లో ప్రజలకు త్రాగునీటి సమస్యలు ఎదురౌతున్నాయని, కాలం చెల్లిన పైపులైన్ల స్థానంలో క్రొత్తవాటిని వేయాలని, ఒవర్హెడ్ ట్యాంకులకు మరమ్మత్తులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. హౌసింగ్ లబ్దిదారులకు జాప్యం లేకుండా బిల్లులు చెల్లించాలని, గృహనిర్మాణం కోసం సేకరించిన స్థలాలకు లెవిలింగ్ చేసి అర్హులైన లబ్దిదారులకు పంపిణీ చేయాలని కోరారు. మూలపాలెం, బైరవలంకల వద్ద ప్రతిపాదించిన బ్రిడ్జిలు సత్వరం కార్యరూపం దాల్చేలా చూడాలని ఎమ్మెల్యే కోరారు.

ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ధ్యాన చంద్ర, సిపిఓ రత్నబాబు, డిఆర్ఓ ఎస్వీఎస్ఎస్ లక్ష్మి, వివిధ శాఖలు, కార్పొరేషన్ల అధికారులు పాల్గొన్నారు.

(సమాచార శాఖచే జారీ)